WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే నవతరం మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం
తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 296 | గురువారం 26-2-2026 | పేజీలు : 4 | వెల : 5-00



## పినాక మిస్సైల్..
2లో

ఈ బేబీ బ్రహ్మోస్ నిల్వలను భారత్ ఎందుకు పెంచుకుంటోంది..

రష్యా,నవతరం
గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం, గాజా యుద్ధం ప్రపంచ దేశాలకు నేర్పుతున్న పాఠాలు ఏంటి? ఈ యుద్ధాలలో సంపూర్ణ విజేతలు ఉండరు. ఈ యుద్ధాలు కొనసాగుతూనే ఉంటాయి.

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

పశుసంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలి
కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు
బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయండి
అధికారులతో మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



హైదరాబాద్,నవతరం
:పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయండని మంత్రి సూచించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలన్నారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్

మిగతా 2లో

## వేంపల్లె నందీశ్వరాలయంలో ప్రతిష్ట

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న వైఎస్



పులివెందుల,నవతరం
వైసిపి అధినేత వైఎస్ జగన్ రెండో రోజు పులివెందులలో పర్యటిం చారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10.30 గంటలకు వేంపల్లి మండలం నందిపల్లి నందీశ్వర ఆలయాన్ని వైఎస్ జగన్ సందర్శించారు. నందీశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమంలో జగన్ పాల్గొన్నారు.
వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆలయానికి రూ. 1.8 కోట్లు మంజూరు చేశారు. మొత్తం ఆరు కోట్ల రూపాయలతో దేవాలయ నిర్మాణం జరిగింది



## కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ

దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి
పసిపాప కుటుంబానికి కెటిఆర్ పరామర్శ

నాగర్‌కర్నూల్,నవతరం
నాగర్ కర్నూల్ జిల్లాలో ఇటీవల కుమ్మెర మల్లన్న జాతరలో జరిగిన గొడవలో రెండు నెలల చిన్నారి మృతిచెందిన ఘటనలో దోషులు ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం కెటిఆర్ పరామర్శించారు. తమకు న్యాయం చేయాలని చిన్నారి కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తున్నారు.

- మిగతా 2లో పేజిలో



## బ్యాంక్‌లకు ఎగవేత కేసు


- అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై సీబీఐ ఎఫ్ఐఆర్
- అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది
- అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై సీబీఐ ఎఫ్ఐఆర్

అనిల్ అంబానీ నివాసం జప్తు

2లో

## కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

ఘోష్ కమిషన్‌ది వ్యక్తిత్వ హననం
కేసీఆర్‌ను దోషిగా చూపడానికి సర్కార్ కుట్ర
ఆయన పరువు ప్రతిష్టలను దెబ్బతీయడమే లక్ష్యంగా
కాళేశ్వరం కమిషన్ విచారణ
హైకోర్టులో కేసీఆర్ తరఫు న్యాయవాది వాదనలు...
విచారణ రేపటికి వాయిదా



2లో

# రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్

- మార్చి 1, 3న విరామం.. తుదిగడువు
- మార్చి 5.. అభిషేక్ మను సింఘ్వికి ఇప్పటికే ఖరారైన సీటు
- రెండో సీటు 'రెడ్డి' సామాజికవర్గానికే ఇచ్చే చాన్స్
- బీఆర్ఎస్‌లో ఇంకా రాని స్పష్టత
- మార్చి 16న పోలింగ్
- అదే రోజు ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలు



హైదరాబాద్, **నవతరం** తెలంగాణకు సంబంధించి ఏప్రిల్‌లో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ గురువారం ఉదయం 11 గంటలకు విడుదల కానుంది. నోటిఫికేషన్ విడుదలైన వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. తుది గడువు మార్చి 5. అయితే.. మార్చి 1 ఆదివారం, 3న హోలీ సెలవుదినాలు కావడంతో ఆ రెండు రోజుల్లో నామినేషన్ల స్వీకరణకు విరామం ఉంటుందని ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా.. రాజ్యసభ సీటుకు నామినేషన్ దాఖలు చేయడానికి

మిగతా 2లో

## చేయూత పథకం కింద ఇస్తున్న పింఛను పెంపు!

- దశల వారీగా చేయూత పింఛను పెంచనున్న ప్రభుత్వం
- తొలి విడతలో రూ.500 పెంచాలన్న యోచన
- బడ్జెట్‌లో కేటాయింపులు చేసే అవకాశం
- ప్రస్తుత పింఛన్ రూ.2,016.. దివ్యాంగులకు 4,016
- ఏడాదికి అవుతున్న మొత్తం వ్యయం రూ.11,400 కోట్లు
- రూ.500 పెంచితే అదనంగా.. ఏటా సుమారు రూ.2500 కోట్లు అవసరం
- విడతల వారీగా 'చేయూత' రూ.4 వేలకు పెంపు




హైదరాబాద్, **నవతరం**
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేయూత పథకం కింద ఇస్తున్న పింఛన్‌ను పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా.. పింఛను మొత్తాన్ని విడతల వారీగా పెంచాలన్న అభిప్రాయంతో ఉంది. ప్రస్తుతం చేయూత పథకం ద్వారా వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ రోగులు, చేనేత, గీత

- మిగతా 2లో పేజిలో

# రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్

(మొదటి పేజీ (తరువాయి)

ఒక్కో నామినేషన్‌పై పది మంది ఎమ్మెల్యేలు సంతకం చేయాల్సి ఉంటుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. ఈ రెండు సీట్లూ ఏకగ్రీవం కానున్నాయా.. లేక ఎన్నికలు జరగనున్నాయా అన్నదానిపై మార్చి 5వ తేదీ సాయంత్రానికి స్పష్టత రానుంది. ప్రధాన ప్రతిపక్షం తన సిటింగ్ సీటును కాపాడుకునే ప్రయత్నంలో అభ్యర్థిని బరిలోకి దించితే మాత్రం 16న పోలింగ్ జరుగుతుంది. అదే రోజున సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అదేరోజు తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలూ ప్రారంభం కానున్నాయి.

ఒక సీటు క్లియర్..

ఎన్నికలు జరగనున్న రెండు రాజ్యసభ సీట్లలో ఒకటి స్పష్టంగా కాంగ్రెస్ పార్టీది. ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వినే తిరిగి ఆ సీటుకు అభ్యర్థిగా ప్రకటించడం దాదాపు ఖరారైంది. రెండోది.. బీఆర్ఎస్ సిటింగ్ సీటు. కానీ, దాన్ని నిలబెట్టుకోవడానికి శాసనసభలో అవసరమైన సంఖ్యాబలం బీఆర్ఎ?సకు లేదు. ఆ పార్టీ.. అభ్యర్థిని పెట్టి గెలిపించుకోవాలంటే ఇతర పార్టీలు ఎంఐఎం లేదా బీజేపీ సభ్యుల మద్దతు తీసుకోవాల్సి ఉంటుంది. అసలే ఆ పార్టీకి సంబంధించి పది మంది ఎమ్మెల్యేలు ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి సన్నిహితంగా ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో




ఎమ్మెల్యేలు విప్‌ను ధిక్కరించి క్రాస్ ఓటింగ్ చేసినా.. అనర్హత నిబంధన వర్తించదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీకి సన్నిహితంగా ఉన్న ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేస్తారన్న నమ్మకమూ లేదు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ తన సిటింగ్ సీటును నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తుందా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. గతంలో ఒక రాజ్యసభ సీటు, రెండు ఎమ్మెల్సీ సీట్లు, విస్తరణలో ఒక మంత్రి పదవి బీసీలకే కేటాయించిన నేపథ్యంలో రెండో సీటు రెడ్డి సామాజిక వర్గానికే దక్కేందుకు ఎక్కువగా అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సీటుకు జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని రంగంలోకి దించాలన్న ఆలోచనలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు చెబుతున్నారు. విపక్షాలకూ ఇబ్బంది లేకుండా స్వతంత్ర అభ్యర్థిగా ఆయన్ను బరిలోకి దింపాలనే ఆలోచనా చేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన కాదంటే సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్‌ల పేర్లూ పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. రెడ్డి సామాజిక వర్గం నుంచి ప్రభుత్వ సలహాదారు చిన్నారెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. పార్టీపరంగా రాజ్యసభ సీటుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇక.. బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను రాజ్యసభకు పంపి.. ఆయన స్థానంలో మంత్రి అజారుద్దీన్‌ను ఎమ్మెల్సీగా చేస్తారన్న ప్రచారమూ ఉంది. ఎస్సీ మాదిగ నుంచి ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్ తన వంతు ప్రయత్నం చేసుకుంటున్నారు. అయితే వికారాబాద్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరానికి మార్చి 2న రాహుల్‌గాంధీ వచ్చే అవకాశం ఉంది. అదే రోజున రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, పార్టీ సీనియర్ నేతలతో ఆయన భేటీ అయి.. రాజ్యసభ అభ్యర్థుల ఖరారుపై చర్చించనున్నట్లు చెబుతున్నారు.

# బ్యాంక్‌లకు ఎగవేత కేసు

ముంబై,ఫిబ్రవరి25రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ముంబైలోని ఆయన విలాసవంతమైన నివాసం 'అబోడ్' ను తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ ఆస్తి విలువ రూ.3,716.83 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. పాలిహిల్ ప్రాంతంలో ఉన్న ఈ భవనం 66 మీటర్ల ఎత్తు, 17 అంతస్తులతో లగ్జరీ టవర్‌గా పేరుంది. అంబానీ గ్రూప్ సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ కోట్లాది రూపాయల మేర బ్యాంకు రుణాల మోసానికి పాల్పడిన కేసులో ఈ జప్తు జరిగింది. దీంతో ఈ కేసులో ఇంతవరకూ జప్తు చేసిన అనిల్ అంబానీ ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది.ర్‌సీఓఎం మోసపూరిత బ్యాంకింగ్ డీలింగ్స్‌తో ఈ తాజా ప్రాపర్టీకి సంబంధం ఉందని ఏజెన్సీ వర్గాలు తెలిపాయి. పీఎంఎల్‌ఏ కింద 2025 ఆగస్టులో అంబానీ స్టేట్‌మెంట్‌ను ఈడీ రికార్డు చేసింది. త్వరలోనే మరోసారి ఆయనను ఈడీ ప్రశ్నించనుంది. అనిల్ అంబానీ ఆర్‌సీఓఎంపై తొలుత సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో దీనిపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసింది. గత జూలైలో 35కు పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించింది. గ్రూప్‌లోని 50 కంపెనీలకు చెందిన 25 మందికి పైగా వ్యక్తులను ప్రశ్నించింది.

# పినాక మిస్సైల్..

**ఈ బేబీ బ్రహ్మోస్ నిల్వలను భారత్ ఎందుకు పెంచుకుంటోంది..**

ఒక దేశ ఆర్థిక, పారిశ్రామిక శక్తికి సవాలు విసురుతాయి.గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధం, గాజా యుద్ధం ప్రపంచ దేశాలకు నేర్పుతున్న పాఠాలు ఏంటి? ఈ యుద్ధాలలో సంపూర్ణ విజేతలు ఉండరు. ఈ యుద్ధాలు కొనసాగుతూనే ఉంటాయి. ఒక దేశ ఆర్థిక, పారిశ్రామిక శక్తికి సవాలు విసురుతాయి. భారీ ఖర్చుతో కూడిన ఆయుధాలతో అంత ఎక్కువ కాలం యుద్ధంలో పాల్గొంటే ఏ దేశమైనా ఆర్థికంగా చితికిపోక తప్పదు. దీంతో యుద్ధాల విషయంలో చాలా దేశాలు పునరాలోచించుకుంటున్నాయి. మన దేశ రక్షణ వ్యూహకర్తలు.. సుదీర్ఘ యుద్ధాల్లో కొత్త టెక్నాలజీతో పాటు తక్కువ ఖర్చుతో తయారయ్యే ఆయుధాల తయారీపై దృష్టి సారించారు

ఈ నేపథ్యంలో రెండు నెలల క్రితం మన దేశం పినాకా మల్టీ-బ్యారెల్ లాంచర్‌ను విజయవంతంగా ప్రయోగించింది (గాఐఖుఐఖ తీశీఎఎవ్ ంఎం-వఎ). 300 కి.మీ. పరిధి గల పినాకా-ఎమ్‌కే4 క్షిపణిని 2023 నాటికి సైన్యంలో చేర్చడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఖరీదైన క్రూయిజ్ క్షిపణులకు బదులుగా, తక్కువ ఖర్చుతో పదే పదే మోహరించగల ఈ స్కేలబుల్ ఫైర్ పవర్ సైన్యానికి ఎంతో ఉపయోగపడుతుంది. భారతదేశం సుదీర్ఘమైన, తీవ్రమైన సంఘర్షణలో పాల్గొనాల్సి ఉంటే ఇలాంటి అధునాతన, చవకైన ఆయుధాలు అవసరం.

# రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో 2,721 డయాలసిస్ మిషన్లు

అమరావతి,ఫిబ్రవరి 25 రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,721 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఇందులో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 985 మిషన్లు, నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 1,736 డయాలసిస్ మిషన్లు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 21,504 మంది కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు.

### కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు

# రాష్ట్ర ప్రభుత్వం కుట్ర

హైదరాబాద్, ఫిబ్రవరి 25 కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా తెలంగాణ గడ్డను సస్యశ్యామలం చేసిన నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్టను దెబ్బతీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆయన తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. వ్యక్తిత్వ హననం చేయాలన్న ధ్యేయంతోనే సుప్రీంకోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ విచారణ జరిపిందని ఆరోపించారు. జస్టిస్ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక చట్టవ్యతిరేకమని పేర్కొంటూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై బుధవారం హైకోర్టులో సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట బుధవారం కేసీఆర్, హరీశ్ తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామ శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు.

ప్రభుత్వ కుయుక్తిని గ్రహించాలి

సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులకు అనుగుణంగా ఘోష్ కమిషన్ పనిచేయలేదని శేషాద్రినాయుడు చెప్పారు. కేసీఆర్‌కు వ్యతిరేకంగా గత ఏడాది ఆగస్టు 4న మీడియా సమావేశంలో కమిషన్ నివేదిక గురించి పాలక పెద్దలు మాట్లాడటాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. హైకోర్టు ఆదేశాలు జారీచేసేదాకా కమిషన్ రిపోర్టును పబ్లిక్ డొమైన్‌లో పెట్టారని, తద్వారా కేసీఆర్ ప్రతిష్టను దెబ్బతీయాలనే కుట్ర చేశారని ఆరోపించారు. కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందే మీడియా సమావేశంలో బహిర్గతం చేయడం ద్వారా కేసీఆర్ దోషి అనే భావన కల్పించేందుకు ప్రభుత్వం చేసిన కుయుక్తిని గ్రహించాలని కోరారు. కమిషన్ నివేదికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు వెల్లడించారని, ఇది కేసీఆర్ వ్యక్తిత్వాన్ని హననం చేయడంగా గుర్తించాలని కోరారు.

# చేయూత పథకం కింద ఇస్తున్న పింఛను పెంపు!




కార్మికులు, బీడీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2016 చొప్పున, దివ్యాంగులకు రూ.4016 చొప్పున పింఛను ఇస్తోంది. కానీ, ఎన్నికల సమయంలో చేయూత పింఛన్‌ను రూ.4 వేలకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం వంటి హామీలను అమలులోకి తెచ్చిన రేవంత్‌రెడ్డి సర్కారు.. ఇప్పుడు పింఛన్ల పెంపుపై దృష్టి సారించింది. అయితే ఈ హామీని కొంతకాలం ఆగాక నెరవేర్చడమా? లేదంటే ఇప్పటి నుంచే విడతల వారీగా పింఛను పెంచుతూ వెళ్లడమా? అని ఉన్నత స్థాయిలో చర్చ జరిగినట్లు సమాచారం. విడతలవారీగా పెంచితే.. తొలి విడతలో రూ.500 పెంచాలన్న అభిప్రాయంతో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది.

42.7 లక్షల మందికి పింఛను..

2024 సామాజిక సర్వే లెక్కల ప్రకారం ప్రస్తుతం 42.7 లక్షల మందికి పింఛను అందుతోంది. ఇందుకోసం ప్రతి నెలా రూ.950 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఈ పింఛన్‌ను ప్రస్తుతానికి రూ.500 చొప్పున పెంచితే.. నెలకు సుమారు రూ.210 కోట్లు అదనంగా అవసరమవుతాయి. అంటే ఏడాదికి రూ.2500 కోట్లకు పైగా భారం ప్రభుత్వంపై పడనుంది. దీనిపై తుది నిర్ణయానికి వచ్చాక బడ్జెట్‌లో కూడా ప్రస్తావించే అవకాశాలున్నాయి. తొలి విడతలో పెంచాలని భావిస్తున్న మొత్తాన్ని కూడా కలిపి బడ్జెట్‌లో కేటాయింపులు చేయన్నుట్లు తెలుస్తోంది. కాగా, దివ్యాంగుల పింఛను పొందేవారు తక్కువ సంఖ్యలోనే ఉన్నారని, వీటి వరకు కొంత ఎక్కువ మొత్తం పెంచాలన్న విజ్ఞప్తులు కూడా ఉన్నాయి. అయితే అందరికీ ఒకే విధంగా, సమ స్థాయిలోనే పెంచాలని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. చేయూత ఫించన్లను ఇలా విడతల వారీగా పెంచుతూ ఎన్నికల నాటికి రూ.4 వేలకు తీసుకెళ్లాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారుల స్థాయిలో మాత్రం చర్చలు మొదలుకాలేదు. ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకున్నాకే తమకు సమాచారం చేరుతుందని ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు.

# కుమ్మెర ఘటన మానవత్వానికే మచ్చ



బాధిత కుటుంబం ఆందోళన చేస్తున్న శిబిరం వద్దకి వెళ్లి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారాయన. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. ఘోరాతి ఘోరమైన మానవత్వానికి మచ్చ తెచ్చే విధంగా చిన్నారిని హత్యచేశారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు నెలల పసిగుడ్డు ప్రాణాలు తీసిన హంతకులను ప్రభుత్వం వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మల్లన్న జాతరలో చిన్నారి తల్లి దర్శనం అడిగినందుకు ఆ పాపను పొట్టనపెట్టుకున్నారని మండిపడ్డారు. దేవుడు దర్శనం అడిగిన పాపానికి.. దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారని ఆగ్రహించారు. ఈ దారుణానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష పడాల్సిందేనని హెచ్చరించారు. పసిగుడ్డు ముఖం చూసి తండ్రిని వదిలిపెట్టమని ప్రాధేయపడ్డ.. వదలకుండా కాలితో ఆ పాపను తన్నితే చనిపోయింది. యూనిఫామ్‌కి విలువ లేకుండా హంతకులను కాపాడే ప్రయత్నం పోలీసులు చేస్తున్నారు. రెండు నెలల పసిగుడ్డుకు కులం తెలుసా..?, మనుషులను చిన్నచూపు చూసి దర్శనానికి రానివ్వకుండా చేయడం ఘోరం. హంతకులు ఎవరైనా.. ఏ పార్టీవారైనా కచ్చితంగా శిక్షించాల్సిందే. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిది మందిని అరెస్టు చేయాల్సిందే. శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందే. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ఘటనపై స్పందించాలి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాల్సిందే. పొత్తిళ్లలోని పసిగుడ్డును హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాల్సిందే. న్యాయం జరిగేదాకా పోరాటం ఆపకండి. దుర్మార్గులను శిక్షించేదాకా వదిలిపెట్టొద్దు. ఈ ఘటనకు కారణమైనా ఎనిమిదిమందిపై హత్యానేరం మోపకపోతే శాసనసభలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీస్తాం. బాధిత కుటుంబాన్ని కంటికి రెప్పల కాపాడుకుంటాం. కులం, మతం లేదు.. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా మేం అండగా ఉంటాం' అని కేటీఆర్ భరోసా కల్పించారు.

# ఆర్థిక మూలాలు పెంచేలా చేయాలి

అవుతామో అధ్యయనం చేయాలన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని, అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి చేయాలన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. ఆర్థిక స్వావలంబన లభించే పథకాలను రూపొందించి అమలుచేద్దాం అని అన్నారు. తెలంగాణకు ఆర్థిక మూలాలు పెంచేలా పశు సంవర్ధకశాఖను అభివృద్ధి పరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులకు దిశానిర్ధేశర చేశారు. . కొత్త ఆలోచనలతోనే పశుసంవర్ధక శాఖలో మార్పులు తీసుకురాగలమని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. పాడి పరిశ్రమ పరిపూర్ణంగా ముందుకు సాగితేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని వివరించారు. బడ్జెట్‌లో నిధులు ఎన్ని కేటాయించారనేది కాకుండా ఎంతమేరకు ఖర్చు చేశామనే ఆలోచన చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. బ్జడెట్ లో అధిక నిధులు కేటాయించేలా నివేదికలు తయారు చేయాలని అధికారులను మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వ పథకాలను రూపొందించాలని మంత్రి సూచించారు. పశుసంవర్ధక శాఖకు సంబంధించి హర్యానా, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల మోడల్‌ను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రంలో పథకాలను డిజైన్ చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమలో ఏం చేస్తే సక్సెస్ అవుతామో అధ్యయనం చేయాల్సిన అవసరముందన్నారు. ఆరోగ్యకరమైన తెలంగాణను నిర్మిస్తేనే భవిష్యత్ బాగుంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అభిప్రాయపడ్డారు. అందుకోసం స్వచ్ఛమైన పాలు, బలమైన పోషకాలు ఉన్న చికెన్, మటన్, చేపల ఉత్పత్తి రాష్ట్రంలో జరుగాలని మంత్రి శ్రీహరి అన్నారు. ఉన్నతాధికారులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ బాధ్యతతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని మంత్రి వాకిటి స్పష్టం చేశారు.పాడి రంగానికి సంబంధించి అన్ని అంశాలు బ్జడెట్‌లో పొందుపరచాలని, పాల ఉత్పత్తి, అందుకావాల్సిన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి శ్రీహరి అన్నారు. పాడి పరిశ్రమ బలోపేతం, సమన్వయం కోసం ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించుకోవాలని, దానివల్ల పాల ఉత్పత్తిని పెంచుకోవొచ్చని మంత్రి వాకిటి శ్రీహరి ఆశాభావం వ్యక్తం చేశారు. వెటర్నరీ సంస్థల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగుల సంక్షేమం వంటి అంశాలకు కూడా బ్జడెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం పశువులకు టీకాలు, ఔషధాల సరఫరా జరిగేలా, దానికి బ్జడెట్‌లో కేటాయింపులు ఉండాలని అధికారులకు మంత్రి వివరించారు. ఈసమీక్ష సమావేశంలో రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, పశుసంవర్ధక, డైరెక్టర్ గోపీ, డెయిరీ డెవలంప్‌మెంట్ ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, పివి నర్సింహరావు వెటర్నరీ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డా.జ్ఞానప్రకాశ్, ఉన్నతాధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వెలుగుమట్ల భూదాన్ భూములపై చర్యలు పూర్తిగా చట్టబద్ధం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- రూ. 250 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తి రక్షణ
- వెలుగుమట్ల భూదాన్ భూములపై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్
- ఓ పక్క బాధితుల ఆర్తనాదాలు,, నివాసాలు కోల్పోయి రోడ్డున పడ్డ జీవితాలు
- నాడు ఓట్ల కోసం మా కాళ్లు పట్టుకున్నారు నేడు మా బ్రతుకులను రోడ్డుకీడ్చారు
- ఏళ్ల తరబడి పట్టింపు లేని భూముల పై ప్రభుత్వ ధ్యాస మమ్మలను గోసపుచ్చుతున్నాయి
- బాధితుల ఆవేదన









నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా


నాడు ఓట్ల కోసం కాళ్లు పట్టుకున్నారు.. నేడు మా ఇండ్లు కూలుస్తున్నారు. మంత్రులు రేవంత్, పొంగిలేటి, భట్టి లకు బాధితుల సాష్టాంగ నమస్కారం. ఖమ్మం వెలుగుమట్లలో చెలరేగిన బాధితుల కంటతడి. ప్రజా పాలన అంటే ఇదేనా? నాడు అధికారం కోసం వెనకబడ్డ పార్టీని భుజాన వేసుకుని మోస్తే నేడు గెలిచాక మా పొట్ట కొడతారా? అంటూ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కలెక్టరేట్ పరిధిలోని వెలుగుమట్ల గ్రామంలో ఇండ్ల కూల్చివేత ప్రక్రియ ఉద్రిక్తతకు దారితీసింది. మంత్రులు పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి,భట్టి విక్రమార్క ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లకు చేతులెత్తి దండం పెడుతూ తమను రోడ్డున పడేయొద్దని బాధితులు వేడుకుంటున్నారు.ఈ గ్రామంలో బుల్డోజర్ల చప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న ఇళ్ళను అధికారులు కూల్చి వేస్తుంటే బాధితుల ఆక్రందనలు మిన్నంటుతున్నాయి "రేవంత్ రెడ్డి గారు,, పొంగిలేటి గారు,, భట్టి విక్రమార్క గారు,, మీకు చేతులెత్తి దండం పెడతాం మా ఇళ్ళను వదిలేయండి అంటూ బాధితులు కంటతడి పెడుతున్నారు. ఎన్నికల సమయంలో ఇదే మంత్రులు ఓట్ల కోసం వచ్చి తమ కాళు పట్టుకున్నారని,,పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు జండా పట్టుకుని మోసినందుకు తమకు ఈ శిక్ష వేస్తున్నారా? అని ప్రశ్నిస్తున్నారు. "ప్రజాపాలన అని చెప్పి మమ్మల్ని గోసపుచ్చుకుంటున్నారు. మా ఇల్లు పోతే మేము ఎక్కడికి వెళ్లాలి ఇది అన్యాయం కాదా?" అని ప్రశ్నిస్తున్నారు. కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో వెలుగుమట్లలో భారీగా పోలీసులు మోహరించారు. నిరుపేదల ఇండ్లను కూల్చివేసి వారిని రోడ్డున పడేయడం దారుణమని తక్షణమే ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే తాజాగా ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ తాజాగా ఓ ప్రకటన తెలిపారు.


అదేమంటేవెలుగుమట్ల గ్రామ సర్వే నం. 147, 148, 149 లోని భూదాన్ భూములపై జిల్లా యంత్రాంగం చేపట్టిన కూల్చివేతలు, స్వాధీన చర్యలు పూర్తిగా చట్టబద్ధమైనవని జిల్లా కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.31 ఎకరాల 7 గుంటల భూదాన్ భూమి ఆక్రమణలో ఉండగా, సంబంధిత భూమి మొత్తం విలువ సుమారు 250 కోట్లకు పైగా ఉంటుందని, భూదాన్ బోర్డు భూమిని సిసిఎల్ఏ, హై కోర్ట్ ఆదేశాల మేరకు ప్రభుత్వం స్వాధీనంలోకి తీసుకోవడం ద్వారా భారీ స్థాయిలో ఆస్తిని రక్షించగలిగామని కలెక్టర్ తెలిపారు.

ఫిబ్రవరి 24 నాడు నిర్వహించిన కూల్చివేతలపై తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు దానిని తిరస్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. భూదాన్ యజ్ఞ బోర్డు, రెవెన్యూ శాఖ సమగ్ర విచారణలో నకిలీ పత్రాలు, అక్రమ కేటాయింపులు వెలుగు చూశాయని, ఇప్పటికే పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైకోర్టు స్టే ఉన్న నిర్మాణాలను మినహాయించి మిగిలిన భూమిని ప్రభుత్వం స్వాధీనం లోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూమిని భవిష్యత్ ప్రజా అవసరాలకు ఉపయోగిస్తామని, ఇండ్లు కోల్పోయిన వారిలో అర్హులైన స్థానిక పేదలకు ప్రభుత్వం తగు విధంగా న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు.అలాగే ఈ భూములపై సమగ్ర విచారణ ప్రక్రియ ప్రారంభమై నిజంగా అర్హులు ఎవరు,,నిజంగా పేదవారు ఎవరు?ఇల్లు లేని కుటుంబాలు ఎవరెవరు?అనే అంశాలపై రెవెన్యూ శాఖ అధికారులు గ్రామస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని, నిజమైన అర్హులైన నిరుపేదలకు మాత్రమే ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ప్రభుత్వ స్థలాలు కేటాయించే దిశగా పారదర్శకంగా చర్యలు కొనసాగుతున్నాయని, ఎలాంటి అక్రమాలు అర్హత లేని వారి జోక్యం లేకుండా విచారణ కఠినంగా జరుగుతోందని, డబ్బులు వసూలు చేసి ప్లాట్లు విక్రయించిన వ్యక్తులపై పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు ప్రారంభించారని, బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాలను తిరిగి రాబట్టి వారికి పరిహారం అందించే ప్రక్రియ కొనసాగుతోందని, అక్రమాలకు పాల్పడిన ప్రధాన నిందితులపై అవసరమైతే పీడీ చట్టం కింద కూడా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తుమ్మల నాగేశ్వరావు జిల్లా కలెక్టర్కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిజంగా ఇల్లు లేని పేద కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ కార్యాలయాల సమన్వయంతో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు లేదా ప్రభుత్వ స్థలాలు తక్షణం కేటాయించాలని సూచించారు.అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా ప్రతి దశలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు.నిజమైన నిరుపేదలకు న్యాయం జరిగే వరకూ ఈ చర్యలు ఆగవని అధికారులు స్పష్టం చేశారు.

# సిద్ధి వినాయక నగర్లో... భారీ అక్రమ నిర్మాణాలు

- నో సెట్బ్యాక్స్... ఓన్లీ కన్స్ట్రక్షన్
- ఒకటికి ఆనుకుని మరొకటి.. ఒకరిని మించి మరొకరు
- రోడ్డును ఆనుకుని నిర్మిస్తున్నా చర్యలు శూన్యం
- సూరారం కాలనీలో రెచ్చిపోతున్న భవన నిర్మాణదారులు
- అధికారులు మారినా అక్రమ నిర్మాణాలు మారడం లేదు





కుత్బుల్లాపూర్, నవతరం: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కుత్బుల్లాపూర్ జోన్ సూరారం కాలనీలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. టీజీ బి పాస్ చట్టానికి వ్యతిరేకంగా.. అనుమతులు ఒకలా పొంది నిర్మాణాలు మరొకలా చేస్తున్నారు ఇక్కడి భవన నిర్మాణదారులు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం సిద్ధి వినాయక నగర్ లో వరుసగా ఒకరిని మించి ఒకరు మూడు ఇండ్ల నిర్మాణాలు పక్కపక్కనే చేపట్టారు. ఎలాంటి సెట్ బాక్సులు వదలకుండా బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు కొనసాగుతున్నా ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఒకరు నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తే మరొకరు ఆరంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఈ మూడు భవన నిర్మాణాలకు కూడా ఎటువంటి స్టేట్ బ్యాక్స్ లేకపోవడం గమనార్హం. అందుకు స్థానికంగా ఉన్న కొందరు చోటమోటా లీడర్లు మద్దతు తెలుపుతున్నట్టు తెలుస్తుంది. బంగారు తెలంగాణలో ఎంతోకొంత చర్యలు తీసుకుని.. మెమున్నాం, చర్యలు తీసుకుంటాం అని చెప్పే అధికారులు.. మాకేం తెలియదు, మా దృష్టికి రాలేదు అంటూ అందినకాడికి దండుకుని నోటీసులు మాత్రమే సర్వ్ చేస్తూ.. దీపం ఉన్నప్పుడే ప్రజాపాలనలో చక్కబెట్టుకుంటున్నారు కాబోలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంటుంది. బల్దియా బాస్ బంగారు తెలంగాణ లో బల్దియా పరిధిలోని సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన 'మై జీహెచ్ఎంసీ యాప్ ను కాస్త మై క్యూర్' చేశారు కానీ ఆన్లైన్ ఫిర్యాదులను మాత్రం బుట్టదాఖలు చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ ఎప్పటికప్పుడు ఇక్కడి పట్టణ ప్రణాళికా విభాగాన్ని పర్యవేక్షణ చేస్తూ.. ఎలాంటి అక్రమ నిర్మాణాల నిర్మాణాలు కొనసాగకుండా చూడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అందుకు చర్యలు ఇక్కడినుండే మొదలు పెట్టాలి, సిద్ధి వినాయక నగర్ ప్లాట్ నంబర్ 22, 23, 24 లో వెలుస్తున్న మూడు అక్రమ నిర్మాణాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# అభివృద్ధి బాటలో కేశప్పగూడెం

- రూ.10 లక్షలతో పాఠశాల ప్రహరీ నిర్మాణం
- సర్పంచ్ సోడెం భారతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్





ఖమ్మం భద్రాద్రి జిల్లా (నవతరం ప్రతినిధి):
మండలంలోని కేశప్పగూడెం గ్రామం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. గ్రామాల్లో విద్యా సౌకర్యాల మెరుగుదలే లక్ష్యంగా సాగుతున్న ఈ క్రమంలో, స్థానిక ప్రాథమిక ఉన్నత పాఠశాల చుట్టూ సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను ఘనంగా ప్రారంభించారు.

రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ప్రహరీ గోడను ప్రారంభించారు. అనంతరం గ్రామ సర్పంచ్ సోడెం భారతి పాఠశాల ఆవరణలో ప్రారంభోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రహరీ గోడ నిర్మాణం అత్యవసరమని, దీనివల్ల పాఠశాల ఆస్తులకు రక్షణ లభించడంతో పాటు విద్యా వాతావరణం మెరుగుపడుతుందని ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయపడ్డారు.ప్రజాప్రతినిధుల కలయిక – అభివృద్ధిపై హర్షం.

ఈ కార్యక్రమంలో కేశప్పగూడెం గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్ర రావు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. సర్పంచ్ సోడెం భారతి నాయకత్వంలో, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేశప్పగూడెం పంచాయతీ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పలువురు ప్రశంసించారు. కేవలం విద్యారంగమే కాకుండా, గ్రామంలోని మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించడం శుభపరిణామమని గ్రామస్తులు కొనియాడారు.

ముఖ్య అతిథులు:
జారే ఆదినారాయణ (ఎమ్మెల్యే, అశ్వారావుపేట)
భారతి (సర్పంచ్, కేశప్పగూడెం)
సుంకవల్లి వీరభద్ర రావు (ఆత్మ కమిటీ చైర్మన్),
స్థానిక వార్డు మెంబర్లు మరియు గ్రామ పెద్దలు పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రపంచంలో ఎక్కడా లేని వింత వినాయకపురం లో!

- మిడి మిడి జ్ఞానంతోనే బాబా సాహెబ్ అంబేడ్కర్ కి కాంగ్రెస్ రంగు పులిమారా?
- అంటున్న వినాయకపురంకు చెందిన కొందరు యువకులు



నవతరం ప్రతినిధి ఖమ్మం భద్రాద్రి జిల్లా

కొంత మంది నీచులు బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి రాజకీయ రంగుపులిమారంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, వినాయకపురం గ్రామానికి చెందిన కొందరు యువకులు ఆవేదన చెందారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కి తెలుసో తెలియదో కానీ, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేయడానికి వచ్చిన ఎమ్మెల్యే జారే కి అక్కడున్న యువకులు అడ్డు తగిలి అభ్యంతరాలు చెప్పారు. అసలు అంబేద్కర్ విగ్రహానికి రాజకీయ కాంగ్రెస్ రంగు వెయ్యటం ఏమిటని అక్కడున్న అంబేద్కర్ వాదులు అడిగారు. అక్కడ ఉన్న యువకుల వాదన విన్న ఎమ్మెల్యే వెంటనే ఆ రంగు తొలగించే ప్రయత్నం చేస్తానని .మధ్యలో అశోక చక్రం వేయిస్తానని అన్నారు.దీనికి మేము ఒప్పుకోము వేస్తే బ్లూ కలర్ వేయాలని లేదా మేమే బ్లూ కలర్ వేస్తామని అన్నార

అక్కడ ఉన్న యువకులను సముదాయించే ప్రయత్నం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి అక్కడ నుంచి పలు కార్యక్రమాలకు హాజరవుటకు వెనిదిరిగారు. ఈ విషయాన్ని మండలంలో అంబేద్కర్ వాదులు, రాజకీయ నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని పంచశీల (బుద్ధుడు) సంబంధించిన రంగులను కానీ లేదా నీలం రంగును గాని వెయ్యకపోతే నిరాహార దీక్ష చేయడానికి పూనుకొంటామని అంబేద్కర్ వాదులు అక్కడున్న యువకులకు ఫోన్ సంభాషణ ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ విషయాన్ని అన్ని రాజకీయ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

# విరోష్ ప్రీమియర్ లీగ్ సెలబ్రేషన్స్



ఫిబ్రవరి 26న గురువారం విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నారు. తాజాగా ఈ తేదీని అధికారికంగా ప్రకటించారు. మంగళవారం మెహందీ, సంగీత్ సందడిగా జరిగినట్లు తెలుస్తోంది. సంగీత్‌లో విజయ్, రష్మిక కలిసి నటించిన సినిమాల్లోని ఫొటోలు, వీరి ప్రేమకథ ఫ్రేమ్‌లతో డెకరేషన్ చేశారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోలను అధికారికంగా షేర్ చేయాలని కోరుతూ అభిమానులు వీరిద్దరినీ ట్యాగ్ చేస్తున్నారు. సంగీత్‌లో భాగంగా ఇరు కుటుంబాలు సరదాగా 'విరోష్ ప్రీమియర్ లీగ్'ను సెలబ్రేట్ చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను విజయ్ దేవరకొండ తన ఇన్‌స్టాలో పంచుకున్నారు. క్రికెట్ బ్యాట్, సిల్వర్ మెడల్‌పై ఫిబ్రవరి 26 అని రాసి ఉండడంతో పెళ్లి తేదీని ఇలా డిఫరెంట్‌గా ప్రకటించారని అభిమానులు సంబరపడుతున్నారు. ఈరోజు హల్దీ వేడుక జరగనుంది. ఉదయ్‌పుర్‌లోని మెమెంటోస్ హోటల్‌లో జరగనున్న వీరి పెళ్లికి ఇండస్ట్రీలోని ప్రముఖులతో పాటు వ్యాపారవేత్తలు కూడా హాజరుకానున్నారు. దీంతో ఉదయపుర్ విమానాశ్రయం అతిథులతో కళకళలాడుతోంది. ఈషా, శ్రావ్యా వర్మ, ఆషిక రంగనాథ్, అనిల్ అంబానీలతో పాటు మరికొందరు సెలబ్రిటీలు ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు.

# మార్చి 4న ఆహాలోకి ఓంశాంతి శాంతి శాంతిః



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఓం శాంతి శాంతి శాంతిః' ఓటీటీలోకి రాబోతుంది. ఇటీవలే ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం డిజిటల్ వేదికగా రాబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. మలయాళంలో సంచలన విజయం సాధించిన 'జయ జయ జయ జయ హే' చిత్రానికి అధికారిక రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా, మార్చి 4 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ ఎ÷-లాట్‌ఫారమ్ 'ఆహా'లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. అయితే ఆహా గోల్డ్ సబ్‌స్క్రైబర్లకి మాత్రం ఒకరోజు ముందుగానే అందుబాటులోకి రాబోతున్నట్లు తెలిపింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో భర్త వేధింపులను ఎదిరించి తన ఆశయాల కోసం పోరాడే ఇల్లాలు ప్రశాంతి పాత్రలో ఈషా రెబ్బా, ఆమె భర్త ఓంకార్ నాయుడుగా తరుణ్ భాస్కర్ నటించారు. జనవరి 30న థియేటర్లలో విడుదలైన ఈ మూవీలో బ్రహ్మాజీ, రోహిణి, శివన్నారాయణ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

# చదువులో ఇద్దరూ ఇద్దరే



టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ- రష్మిక మంధాన ఫిబ్రవరి 26న పెళ్లి బంధంలోకి అడుగు పెట్టబోతున్నారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో వీరి వివాహ వేడుకలు జరుగుతున్నాయి. ఇప్పటికే కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిసి ఈ జంట అక్కడికి చేరుకుంది. , ముఖ్యంగా విద్యాభ్యాసానికి సంబంధించిన ఆసక్తికర విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సినిమాల్లోకి రాకముందు విజయ్, రష్మిక ఇద్దరూ తమ చదువును పూర్తి చేసి తర్వాతే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. విజయ్ దేవరకొండ తొలుత హైదరాబాద్‌లోని లోకల్ స్కూల్‌లో చదివారు. ఆ తర్వాత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హయర్ సెకండరీ స్కూల్లో హాస్టల్‌లో ఉంటూ 10వ తరగతి వరకు చదివారు. అనంతరం హైదరాబాద్‌లోని లిటిల్ ఫ్లవర్ జూనియర్ కాలేజ్‌లో ఇంటర్ పూర్తి చేశారు. తర్వాత హైదరాబాద్‌లోని భద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో కామర్స్ డిగ్రీ చేశారు. డిగ్రీ పూర్తయ్యాకే సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. మొదట క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు చిత్రాల్లో నటించి, తరువాత 'పెళ్లిచూపులు' సినిమాతో హీరోగా గుర్తింపు పొందారు. ఇక రష్మిక మందన్న మొదట కూర్గ్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు.

# దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలి

తమన్నా భాటియా వెల్లడి




నటీనటులు ఇండస్ట్రీలో వరుస అవకాశాలు ఉన్నప్పుడే వేరే ఆదాయ మార్గాలు చూసుకోవాలని నటి తమన్నా అన్నారు. లేదంటే తర్వాత చాలా ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. 15 ఏళ్ల వయసులో పరిశ్రమలోకి వచ్చిన తమన్నా 21 సంవత్సరాల నుంచి అగ్ర హీరోల సరసన నటిస్తూ మెప్పిస్తున్నారు. కొత్తగా నగల వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఆర్థిక ప్రణాళికలు నేర్చుకున్నట్లు తెలిపారు. నేను ఇండస్ట్రీకి వచ్చిన తొలినాళ్లలో నా ఆర్థిక వ్యవహారాలన్నీ మా నాన్నే చూసుకున్నారు. నాకు ఎంతో మద్దతు ఇస్తూ.. మార్గనిర్దేశర చేశారు. ఇప్పుడు నేను జాగ్రత్తలు తీసుకుంటూ రియల్ ఎస్టేట్, నగల వ్యాపారాలతో పాటు ఎన్నో రంగాల్లో పెట్టుబడులు పెట్టాను. అవే నాకు భవిష్యత్తులో ఉపయోగపడతాయి. నేను ఇలా ఆలోచించడానికి నా తండ్రే కారణం. ఆయనే వల్లే ఈ క్రమశిక్షణ నేర్చుకున్నాను. అందరికీ ఈ విషయంలో దూరదృష్టి అవసరం. ముఖ్యంగా ఇండస్ట్రీలో ఉన్నవారు అవకాశాలు ఉన్నప్పుడే సరైన మార్గాల్లో డబ్బు ఆదా చేసుకోవాలి. దాన్ని పెంచుకునే దారులు కనిపెట్టాలి. లేదంటే చివరకు ఏమీ మిగలదు' అని తమన్నా అన్నారు. ఇక ఈ ఏడాది తమన్నా వరుస ప్రాజెక్ట్‌లతో సందడి చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'వివాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్' మే15న విడుదల కానుంది. అలాగే అజయ్ దేవ్‌గణ్, సంజయ్‌దత్ నటిస్తోన్న 'రేంజర్'లో తమన్నా కూడా కీలక పాత్రలో కనిపిస్తున్నట్లు సమాచారం.

# టాలీవుడ్‌లోకి హాలీవుడ్ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ

## అన్నపూర్ణలో ప్రారంభించిన దర్శకధీరుడు జక్కన్న

తెలుగు సినీ ఇండస్ట్రీలో సాంకేతికత కొత్త పుంతలు తొక్కడానికి సిద్ధమైంది. ఇప్పటికే పాన్ఇండియా సినిమాలతో దూసుకెళ్తున్న తెలుగు సినీ పరిశ్రమలో టెక్నాలజీపరంగా సరికొత్త అడుగుపడింది. 'అవతార్' సహా ఎన్నో హాలీవుడ్ సినిమాలను మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ సాయంతో తీస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటివరకూ తెలుగు మేకర్స్ ఈ సాంకేతికత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఇప్పుడు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి ఎంఅండ్ఎం క్యాప్ ల్యాబ్‌ను బుధవారం ఆవిష్కరించారు. మహేశ్‌బాబు కథానాయకుడిగా రూపొందిస్తున్న 'వారణాసి'లోని కీలక సన్నివేశాలను అక్కడ తీసినట్లు తెలిపారు. అన్నపూర్ణా స్టూడియోస్, శోభు యార్లగడ్డ మిహిరా విజువల్ ల్యాబ్స్, హాలీవుడ్ కంపెనీ యానిమాట్రిక్ ఫిల్మ్ డిజైన్ సంయుక్తంగా ఈ సాంకేతికతను అందుబాటులోకి తెచ్చాయి. గతంలో అన్నపూర్ణ స్టూడియోస్‌లోనే ఏర్పాటు చేసిన 'డాల్బీ సినిమా ప్రాసెస్' సౌకర్యాన్ని రాజమౌళి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ స్టూడియో కూడా ఆయన చేతుల మీదుగానే ప్రారంభమైంది. ఈ సందర్భంగా జక్కన్న మాట్లాడుతూ.. అంతర్జాతీయ సినీ నిర్మాణ సంస్థలకు భారత్ నుంచే అత్యుత్తమ సాంకేతిక నిపుణులు







# ఊపేస్తున్న నాని ఆయా షేర్ సాంగ్

ప్రస్తుతం సోషల్ మీడియాలో నేచురల్ స్టార్ నాని 'ఆయాషేర్' మేనియా ప్రకంపనలు సృష్టిస్తోంది. తన రాబోయే చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి విడుదలైన ఈ స్పెషల్ సాంగ్ అటు టాలీవుడ్‌తో పాటు ఇటు డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌లో రికార్డులను తిరగరాస్తోంది. ఈ పాటలో నాని చూపించిన మాస్ ఎనర్జీ మరియు సిగ్నేచర్ స్టెప్పులు చూస్తుంటే, ఆయన గత పవర్‌ఫుల్ పాత్రల ప్రభావాన్ని కూడా ఇది మించిపోయిందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు. మరోవైపు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి 'ఔరా ఆఫ్ ఉస్తాద్' పాట కూడా ఇటీవలే విడుదలైంది. మొదట్లో ఈ పాట ట్రెండింగ్‌లో నిలిచినప్పటికీ, నాని 'ఆయాషేర్' వచ్చిన తర్వాత సీన్ పూర్తిగా మారిపోయింది. విడుదలైన కొన్ని గంటల్లోనే 'ఆయాషేర్' పాట 'ఉస్తాద్'ను వెనక్కి నెట్టి మ్యూజిక్ సెక్షన్‌లో టాప్ 1 స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో 'ఆయాషేర్ దెబ్బకి ఉస్తాద్ ఔరా గల్లంతయింది' అంటూ అభిమానులు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున కామెంట్లు చేస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించిన ఈ పాటకు కాసర్ల శ్యామ్ అదిరిపోయే సాహిత్యం అందించారు. ఇప్పటికే ఈ పాటపై వేల సంఖ్యలో రీల్స్ వస్తుండగా, సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకు అందరూ నాని మాస్ స్టెప్పులను అనుకరిస్తూ వీడియోలు పోస్ట్ చేస్తున్నారు. మిలియన్ల కొద్దీ వ్యూస్‌తో ఈ పాట ప్రస్తుతం ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది.

## తమిళ మూవీలో

# వైష్ణవి చైతన్య



తెలుగులో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన బేబి సినిమాతో సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది వైష్ణవి చైతన్య . ఈ భామ ప్రస్తుతం ఆనంద్ దేవరకొండతో మరో సినిమా చేస్తూ బిజీగా ఉంది. కాగా ఈ బ్యూటీ ఇక తమిళంలో కూడా తన లక్‌ను పరీక్షించుకునేందుకు రెడీ అయిందన్న వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. వైష్ణవి చైతన్య, పాపులర్ కోలీవుడ్ కంపోజర్ కమ్ యాక్టర్ జీవీ ప్రకాశ్ కుమార్ హీరోగా తెరకెక్కబోతున్న సినిమాలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుందని తాజా కథనాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ భామ ఇప్పటికే తమిళంలో అజిత్ కుమార్ నటించిన వలిమైలో కామియో రోల్‌లో మెరిసింది. ఇదే నిజమైతే వైష్ణవి చైతన్యకు తమిళంలో హీరోయిన్‌గా తొలి సినిమా ఇదే కానుంది. మొత్తానికి వైష్ణవి చైతన్య బ్యాక్ టు బ్యాక్ ఆఫర్లతో సౌతిండియన్ ఫిలిం ఇండస్ట్రీలో తనకంటూ స్పెషల్ ఐడెంటిటీ తెచ్చుకోవాలనే ప్రయత్నంలో బిజీగా ఉన్నట్టు తాజా అప్‌డేట్ చెప్పకనే చెబుతోంది. రానున్న రోజుల్లో వైష్ణవి చైతన్య నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com